క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



బాధితులకు చెక్కు అందిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన కొత్తపేట నియోజకవర్గం రావుల పాలెం ప్రాంతానికి చెందిన కర్రి గౌరిమణికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.2 లక్షలు మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును ఎంపీ అనురాధ మొగల్లమూరులోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 26 మంది ఎంపిక

అమలాపురం టౌన్: స్థానిక శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన దివీస్ క్యాంపస్ డ్రైవ్‌లో 26 మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కాయి. దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ ఫార్మా కంపెనీ నిర్వహించిన ఈ డ్రైవ్‌లో మొత్తం 116 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఆ కంపెనీ హెచ్ఆర్‌లు ఎ.రాజేష్, పి.రామకృష్ణ, సీహెచ్ పూర్ణప్రసాద్‌లు ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ లెటర్లను అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎస్ మనోహర్ తెలిపారు. ఎమ్మెస్సీ, బీఎస్సీ విద్యార్థులతో జరిగిన ఈ డ్రైవ్‌లో ఉద్యోగార్థులు రూ.2.92 లక్షల నుంచి రూ.4.20 లక్షల వార్షిక జీతాలతో ఎంపికయ్యారని చెప్పారు. వీరిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహారావు, వైస్ చైర్మన్ కరాటం ప్రవీణ్, అధ్యాపకులు అభినందించారు.

చెస్ పోటీల్లో తృతీయ స్థానం

కాట్రేనికోన: ఒంగోలులో ఆర్ఐఎస్ఈ కృష్ణ సాయి ప్రకాశం గ్రూపు ఆఫ్ ఇనిస్టిట్యూట్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజియేట్ చెస్ టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ సెలక్షన్ ట్రైల్‌లో చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, పాలకవర్గ సభ్యులు సందీప్, రమేష్‌రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు అభినందించారు.

ఉప సర్పంచ్‌గా అనసూయ

ఉప్పలగుప్తం: ఎస్.యానం గ్రామ ఉప సర్పంచ్‌గా బడుగు అనసూయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముందుగా సర్పంచ్ జోగి రాజేశ్వరి అధ్యక్షతన ఎన్నికల అధికారి, ఈవోపీఆర్డీ కె.కామేశ్వరరావు ఉప సర్పంచ్ ఎన్నిక నిమిత్తం శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాలకవర్గ సభ్యులు ముందుగా చేసుకున్న జెంటిల్‌మెన్ ఒప్పందం ప్రకారం 11వ వార్డు సభ్యురాలు అనసూయను ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకూ 9వ వార్డు సభ్యుడు పెట్టా మురళీకృష్ణ ఉప సర్పంచ్‌గా కొనసాగారు. అనసూయను ఎంపీటీసీ సభ్యుడు పెట్టా అప్పారావు, పార్టీ నాయకులు జోగి రాజా, పొగాకు శ్రీను, అయితాబత్తుల సూరిబాబు తదితరులు అభినందించారు.

యాంటీబయోటిక్స్‌ను అరికట్టాలి

ఉప్పలగుప్తం: ఆక్వా సాగులో యాంటీబయోటిక్స్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని నాక్సా ఆర్‌సీఓ ఎస్‌పీ చంద్రశేఖర్ అన్నారు. చల్లపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఆక్వా రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రొయ్యలు, చేపల సాగులో యాంటీబయోటిక్స్ ఉపయోగించకుండా చేపట్టాల్సిన పద్ధతులను రైతులకు వివరించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బడుగు మేరీకుమారి, సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, నాక్సా ఎస్‌సీఓ ఎస్.బాలాజీ, ఫీల్డ్ మేనేజర్ వీరబాబు, ఆక్వా రైతులు ఇసుపట్ల రఘుబాబు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖోఖో పోటీలు

యానాం: స్థానిక ఎంజీజీబీహెచ్ క్రీడా మైదానంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాలికల అండర్–14 ఖోఖో పోటీలు జరిగాయి. వివిధ పాఠశాలల నుంచి బాలికలు వచ్చి ఖోఖో పోటీలో తలపడ్డారు. పరంపేట ప్రభుత్వ హైస్కూల్ జట్టు ప్రథమ, కనకాలపేట ప్రభుత్వ హైస్కూల్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, ఆర్గనైజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

బదిలీలపై వివాదం

యానాం: నియోజకవర్గ పరిధిలో పాఠశాలల్లో రాజీవ్‌గాంధీ బ్రేక్‌ఫాస్ట్ పథకం ద్వారా విద్యార్థులకు పాలు కాచి పంపిణీ, తదితర నిర్వహణను చేస్తున్న మిల్క్ బాయిలర్స్ మహిళల బదిలీలపై వివాదం నెలకొంది. దీంతో పలువురు శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి, ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్‌కు ఫిర్యాదు చేశారు. వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మొత్తం 32 మంది మిల్క్‌బాయిలర్‌కు బదిలీలు చేస్తూ గత నెల 19న ఆర్‌ఏఓ మునిస్వామి ఆదేశాలు జారీ చేశారు. అయితే చాలావరకూ ఆయా హెచ్ఎంలు సంబంధిత మిల్క్ బాయిలర్స్‌ను రిలీవ్ చేశారు. 8 మంది మాత్రం తాము ఉన్న పాఠశాలలోనే విధులు నిర్వహిస్తామని చెప్పడంతో వివాదం నెలకొంది. దీనిపై ఆర్‌ఏఓ సోమవారం నిర్ణయం తీసుకుంటామని చెప్పారని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ వివరించారు.

పుస్తకాలు.. విజ్ఞాన దీపాలు

శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు నానిరాజు

అమలాపురం టౌన్: విజ్ఞాన గనిగా అలరారే గ్రంథాలయాల్లోని పుస్తకాలు విజ్ఞాన దీపాలని శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల్లో నాలుగో రోజు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నానిరాజు మాట్లాడారు. కోనసీమ రచయితల సంఘ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, గ్రంథాలయాధికారి పోలిశెట్టి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కవులు, రచయితలు రాసే కావ్యాలు, పుస్తకాలు సమాజ హితంగా, సందేశాత్మకంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవులు గ్రంథాలయాల విశిష్టత, వినియోగంపై కవితా గానాలను వినిపించారు. కవులు మాకే బాలార్జున సత్యనారాయణ, డాక్టర్ శ్రీపాద రామకృష్ణ, నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, టి.వెంకటేశ్వరరావు తదితరులు తమ కవితా గానాలతో గ్రంథాలయాలు పవిత్ర ఆలయాలుగా పాఠకులకు ఎంతటి ప్రతిఫలాన్ని ఇస్తున్నాయో వివరించారు. కార్యక్రమంలో పాఠకులు చిక్కాల రవిశంకర్, గున్నేపల్లి భీమశంకరం, ఆకుల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం బాలికల ఉన్నత పాఠశాలలో బాల, బాలికలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను లైబ్రేరియన్ శీలం నాగరాజు పర్యవేక్షించారు.

అమలాపురం రూరల్: సవరప్పాలెం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో సమనస శ్రీరామ్ స్కూల్‌లో క్రీడా పోటీలు జరిగాయి. విద్యార్థులకు ఖోఖో, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మీ గణేష్, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, గ్రంథాలయ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో చిత్రలేఖనం పోటీల్లో బాల బాలికలు



అమలాపురం సభలో మాట్లాడుతున్న శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు నానిరాజు



సమనసలో ఖోఖో పోటీల్లో బాలికలు

క్రీడా మైదానాలను సిద్ధం చేయండి



ఆడుదాం ఆంధ్రా క్రీడలపై శిక్షణ ఇస్తున్న రిఫరీ శ్రీనివాస్

అల్లవరం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విజయవంతానికి ప్రతి సచివాలయ పరిధిలో ఎంపిక చేసిన క్రీడా మైదానాలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ కృష్ణ మోహన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆడుదాం ఆంధ్రాపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్ విభాగాల్లో క్రీడలు నిర్వహిస్తామని, దీనికి క్రీడా మైదానాలు చాలా కీలకమని తెలిపారు. క్రీడా మైదానాలు ఎంపిక చేసే బాధ్యత పీడీ, పీఈటీలు తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులకు జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ రిఫరీ జి.శ్రీనివాస్ క్రీడలపై శిక్షణ ఇచ్చారు. ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు, పీడీలు అప్పారి త్రిమూర్తులు, ఈశ్వరరావు, ఎం.రాము తదితరులు పాల్గొన్నారు.

బోటు దగ్ధం ఘటనపై విచారణ చేయండి



యానాం పోలీస్ స్టేషన్ వద్ద మత్స్యకారుల నిరసన

యానాం: సావిత్రినగర్‌లో బోటును దగ్ధం చేసిన ఘటనపై విచారణ నిర్వహించి నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆ గ్రామానికి చెందిన మత్స్యకారులు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సావిత్రినగర్‌కు చెందిన కామాడి భైరవస్వామికి చెందిన బోటును సముద్రంలోకి దూరంగా తీసుకువెళ్లి దగ్ధం చేశారన్నారు. ఈ బోటు విలువ సుమారు రూ.5.50 లక్షలు ఉంటుందని, దానిపై ఆధారపడిన 8 కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయారన్నారు. నిందితుని వివరాలను పోలీసులకు తెలియపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ షణ్ముగం మాట్లాడుతూ నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక ఆర్‌ఏఓ కార్యాలయానికి చేరుకుని ఆర్‌ఏఓ మునిస్వామికి జరిగిన ఘటన గురించి వారు వివరించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు మోదే హరిశ్చంద్ర, కర్రి చినపేరియ్య, పెసింగి బాబీ, అరదాడి జయన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

3న కోనసీమ శెట్టిబలిజ కార్తిక వన సమారాధన



కార్తిక వన సమారాధనపై చర్చిస్తున్న శెట్టిబలిజ సంఘాల పెద్దలు, నాయకులు

అమలాపురం టౌన్: స్థానిక వాసర్ల వెంకన్న గార్డెన్స్‌లో డిసెంబర్ 3న కోనసీమ శెట్టిబలిజ కార్తిక వన సమారాధన నిర్వహించేందుకు ఆ సామాజికవర్గ ఆయా మండలాల సంఘ ప్రతినిధుల సమావేశం నిర్ణయించింది. వెంకన్న గార్డెన్స్‌లో కోనసీమ శెట్టిబలిజ పెద్ద మట్టపర్తి మీరా సాహెబ్‌శెట్టి అధ్యక్షతన శుక్రవారం సన్నాహక సమావేశం జరిగింది. శెట్టిబలిజ సంఘాల పెద్దలు సంసాని బులనాని, వాసంశెట్టి తాతాజీ, కుడుపూడి బాబు, చెల్లుబోయిన శ్రీనివాస్, ఇళ్ల శేషారావు, బొక్కా ఆదినారాయణ, బొంతు గోవిందశెట్టి, దంగేటి రుద్ర, కుడుపూడి భరత్‌భూషణ్, మట్టపర్తి రామారావు తదితరులు కార్తిక వన సమారాధన ఏర్పాట్లపై పలు తీర్మానాలు చేశారు. ఆ రోజు శెట్టిబలిజలు సంఘీభావాన్ని ప్రకటించడంతో పాటు అందరూ ఆత్మీయ వాతావరణంలో సహపంక్తి భోజనాలు చేయాలని పెద్దలు పిలుపునిచ్చారు. సమావేశంలో కోనసీమకు చెందిన పలు మండలాల శెట్టిబలిజ సంఘాల నేతలు పాల్గొని వన సమారాధన నిర్వహణపై చర్చించారు.

తెల్లదోమ నివారణతో మంచి దిగుబడి

ఉప్పలగుప్తం: కొబ్బరి రైతులు తెల్లదోమ నివారణకు చర్యలు చేపట్టి, మంచి దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు అన్నారు. ఉప్పలగుప్తం గ్రామ పంచాయతీ పరిధి పెద్దూరులో ఆయనతో కలసి ఉద్యాన అధికారి కె.చందన స్థానిక రైతులతో శుక్రవారం సమావేశమయ్యారు. కొబ్బరి చెట్టుకు తెల్లదోమలతో కలిగే నష్టాలను వివరించారు. వాటి నివారణకు అవసరమయ్యే సూడో మొల్లాడ ఆస్టర్ బదనికలు, పసుపు రంగు బకరాలు, నీమాల్ మందును రైతులకు ఉచితంగా అందించారు. అనంతరం ఏఓ కుమార్‌బాబు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాలసుబ్రహ్మణ్యం, కొఠారి రామకృష్ణ, మోటూరి పేరయ్యనాయుడు, ఆకుల సూర్యవెంకట సత్యనారాయణ, గోకరకొండ గంగాచలం, కాశి చిన్నా, వీఏఏలు శివాజీ, వర్ధన్, ప్రకాష్ పాల్గొన్నారు.



ఉప్పలగుప్తంలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు

మంచి ఆహార అలవాట్లు అవసరం

అమలాపురం టౌన్: ఫార్మా కంపెనీ గ్లెన్మార్క్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాగ్దేవి స్కూల్‌లో విద్యార్థులకు 'కాఫాలజీ' అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణానికి చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణుడు కె.శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పిల్లల్లో తరచూ వచ్చే రొంప, దగ్గు, శ్వాస సంబంధమైన సమస్యలను ఆహారపు అలవాట్ల ద్వారా నయం చేసుకోవచ్చని తెలిపారు. తరచూ అనివార్యమయ్యే ఈ రుగ్మతనే కాఫాలజీ అంటారన్నారు. గ్లెన్మార్క్ కంపెనీ ప్రతినిధులు నట్వర్ షేక్, కిరణ్‌లు కూడా ఈ సదస్సులో పాల్గొని మన శరీరాన్ని కాఫాలిజీ నుంచి ఎలా కాపాడుకోవచ్చో వివరించారు. సదస్సులో శ్రీవాగ్దేవి స్కూల్ డైరెక్టర్ పరసా శ్రీరామమూర్తి (భరత్), ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి, హెచ్ఎం పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. చివరగా ఆ కంపెనీ ప్రతనిధులు స్కూల్ యాజమాన్యానికి, విద్యార్థులకు సదస్సు నిర్వహణపై ధ్రువీకరణ పత్రాలు అందించారు.



స్కూల్ యాజమాన్యానికి ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న గ్లెన్మార్క్ కంపెనీ ప్రతినిధులు

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

అల్లవరం: బోడసకుర్రు జాతీయ రహదారిపై అమలాపురం నుంచి పాశర్లపూడి వైపు వెళ్తున్న కారు ఢీకొని బోడసకుర్రు పల్లిపాలేనికి చెందిన ఓలేటి రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బోడసకుర్రు కాలువ గట్టు నుంచి జాతీయ రహదారి పైకి వచ్చేసరికి కారు రాజుని ఢీకొంది. బాధితుడిని అమలాపురంలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రాజు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై జంగా సత్యనారాయణ తెలిపారు.

పథకాలు పునరుద్ధరించాలని వినతి

అమలాపురం రూరల్: ఎస్సీ పథకాలను పునరుద్ధరించాలని కోరుతూ అమలాపురంలో మంత్రి పినిపే విశ్వరూప్‌కు బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోనుగుపాటి శ్రీనివాసరావు వినతి పత్రం అందించారు. దీనిపై మంత్రి విశ్వరూప్ స్పందిస్తూ వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తానని తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, సోషల్ మీడియా కన్వీనర్ రొక్కాల సత్తిబాబు, కొండేటి ఈశ్వర్, అరిగెల తేజ తదితరులు పాల్గొన్నారు.

నేరెళ్లమ్మ సన్నిధిలో అన్నసమారాధన

తాళ్లరేవు: స్థానిక జాతీయ రహదారి 216లోని గణపతి నగర్ వద్ద వేంచేసి ఉన్న నేరెళ్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన జరిగింది. దసరా నవరాత్ర ఉత్సవాల ముగింపు నేపథ్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. దీనికి యానాం, తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

శ్రీలప్రభుపాదుల తిరోభావ దినోత్సవం

అమలాపురం రూరల్: ఇస్కాన్ సంస్థాపక ఆచార్యులు భక్తి వేదాంత స్వామి శ్రీలప్రభుపాదుల తిరోభావ దినోత్సవాన్ని జనుపల్లెలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖండ హరినామ సంకీర్తన జరిగింది. స్థానిక ఇస్కాన్ ఇన్‌చార్జి శివానంద నిమయి దాస్ మాట్లాడుతూ శ్రీల ప్రభుపాదుల జీవిత చరిత్రను వివరించారు. శ్రీల ప్రభుపాదుల రచనలు 140కి పైగా వివిధ భాషలలో ఉన్నాయన్నారు. ప్రపంచ దేశాల్లో 108 మందిరాలను ఆయన స్థాపించారని తెలిపారు. ఇప్పుడు అవి 900 వందలకు పైగా విస్తరించాయన్నారు. అనంతరం స్వామి విగ్రహానికి హారతి ఇచ్చి భక్తులు పుష్పాంజలి ఘటించారు. జనుపల్లె గ్రామ ప్రజలు, ఇస్కాన్ దాతలు పాల్గొన్నారు.

యూనివర్సిటీ జట్టుకు ఎంపిక

తాళ్లరేవు: జేఎన్‌టీయూ కాకినాడ పరిధికి సంబంధించి ఒంగోలులో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన సెంట్రల్ జోన్ కబడ్డీ జట్టు ఎంపికల్లో పైడా కళాశాల విద్యార్థిని పీఆర్ నాగసాయి ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ పైడా సత్యశ్రీరామ్ శుక్రవారం తెలిపారు. శుక్రవారం స్థానిక కళాశాలలో నాగసాయిని కళాశాల సెక్రటరీ సత్యశ్రీరామ్, డీన్ వీరభద్రరావు, డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ పీవీ సూర్యప్రకాష్ తదితరులు అభినందించారు.

మత్స్యకారుల సంక్షేమానికి అవిరళ కృషి

- నష్ట పరిహార నిధులను సద్వినియోగం చేసుకోండి
- ఆత్మీయ సభలో ఎమ్మెల్యే పొన్నాడ



పటవల సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: మత్స్యకారుల సంక్షేమానికి అవిరళ కృషి చేస్తున్నామని టీటీడీ పాలకమండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో మత్స్య సంపద అంతరించిపోతున్నందు వల్లే ఆయా కంపెనీల నుంచి నష్ట పరిహారం తీసుకువస్తున్నామని, ఆయా నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చొల్లంగిపేట, మట్లపాలెం, కొత్తూరు, రామన్నపాలెం గ్రామాల్లో నిర్వహించిన మత్స్యకారుల ఆత్మీయ సభల్లో ఆయన మాట్లాడారు. మత్స్యకారులకు నష్ట పరిహారం ఇచ్చిన దాఖలాలు దేశంలోనే ఎక్కడా లేవని, ఎన్నో పోరాటాలు చేసి ఈ నష్ట పరిహారాన్ని సాధిస్తున్నట్లు తెలిపారు. మత్స్యకార కుటుంబాలకు ఓఎన్‌జీసీ అందజేస్తున్న నష్ట పరిహారానికి సంబంధించి ఒక్కొక్క లబ్ధిదారునికి గతంలో ఆగిపోయిన రూ.47 వేలతో పాటు మూడు విడతలుగా రూ.46 వేల చొప్పున ఇప్పటికే జమ చేసినట్లు తెలిపారు. నాలుగో విడతలో ఆరు నెలల కాలానికి ఒక్కొక్కరికీ రూ.69 వేల చొప్పున ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌లలో జమ చేస్తారన్నారు. మొత్తంగా ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.రెండున్నర లక్షల లబ్ధి చేకూరిందన్నారు. ఒక కుటుంబంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటే వారికి జరిగిన లబ్ధి రూ.ఐదు లక్షలపైనే అని తెలిపారు. ఈ నెల 21న కోరంగిలో నిర్వహించే ప్రపంచ మత్స్యకార సదస్సుకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే పొన్నాడను గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, మత్స్యకార నాయకులు అంగాడి నారాయణరావు, మైదు హరిబాబు, పినపోతు స్వామి, శ్రీను, పినపోతు చినకామేశ్వరరావు, కొపనాతి నాగరాజు, అంకాడి అంజిబాబు, కామాడి మాతరాజు, అరదాడి అన్నవరం, నీలపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్రాయ నమో నమః

అమలాపురం టౌన్/ ఐ.పోలవరం/ ముమ్మిడివరం: నాగేంద్రాయ నమో నమః అంటూ ఆ స్వామిని భక్తులు కొలిచారు.. నాగుల చవితిని పురస్కరించుకుని అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పుట్టల్లో కోడిగుడ్లు, పాలు, తేగలు, బుర్ర గుంజులు, చిమ్మి, పసుపు ఉండలు వేసి నాగన్నను భక్తితో కొలిచారు. పుట్టల వద్ద బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అమలాపురం పట్టణ శివార్లలో దాదాపు 65 చోట్ల పుట్టల వద్ద సందడి కనిపించింది. అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం, చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద, ఎన్టీఆర్ మార్గ్‌లోని మానసాదేవి నాగ బంధం, నవగ్రహాల ఆలయంలో పాముల పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు. స్థానిక మానసాదేవి ఆలయం వద్ద డీఆర్వో సీహెచ్ సత్తిబాబు దంపతులు, ఎస్పీ సుసరాపు శ్రీధర్ సతీమణి, పలువురు విశ్రాంత న్యాయమూర్తులు, అధికారులు పూజలు చేశారు. ఐ.పోలవరం మండలంలో పవిత్ర వృద్ధ గౌతమీ గోదావరి స్నానాలు ఆచరించి ఆలయాలకు, పాముల పుట్టల వద్దకు వచ్చి భక్తులు ప్రత్యేక పూజలు గావించారు. మురమళ్ల, తిళ్లకుప్ప, కొమరగిరి, ఐ.పోలవరం, గుత్తెనదీవి, జి.వేమవరం గ్రామాల్లో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. పిల్లలు బాణసంచా కాల్చారు. ముమ్మిడివరం మండలంలో నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పుట్టల వద్ద నాగేంద్రుడిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు చేశారు.

నాగదోష నివారణ పూజలు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్‌నగర్‌లోని శ్రీఆదిశేష నిలయంలో నాగుల చవితి సందర్భంగా శుక్రవారం ఉదయం కాలసర్ప, రాహు, కేతు, కుజ, నాగదోష నివారణ పూజలు జరిగాయి. శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగ ప్రతిష్ఠ, నాగ సాధన జరిగాయి. అక్షయపాత్ర ప్రతినిధులు తూము దొరబాబు, పోతురాజు నాగకనకదుర్గ, నూకల కుమారి తదితరులు నాగ సాధన చేశారు.

తాళ్లరేవు: మండలంలోని జి.వేమవరం, పోలేకుర్రు, పి.మల్లవరం, జార్జిపేట, ఉప్పంగల తదితర గ్రామాల్లో పుట్టల వద్ద నాగేంద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు బాణసంచా కాల్చి సందడి చేశారు.

యానాం: నియోజకవర్గ పరిధిలో నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఇందిరా గాంధీ విగ్రహం సమీపంలో భీమ్‌నగర్ వద్ద ఉన్న పుట్టల వద్దకు భక్తులు వచ్చి పాలు పోసి పూజలు చేశారు. జీఎస్ నాయుడు కాలనీ, మెట్టకూరు తదితర ప్రాంతాల్లో కూడా సందడి కనిపించింది.

అమలాపురం రూరల్: బండారులంకలో నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం దేవస్థానం మాజీ సభ్యుడు చింతా శంకర మూర్తి, జాన సోమరాజు దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని నాగదేవతను కొలిచారు.



అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పుట్ట వద్ద భక్తుల పూజలు



మురమళ్ల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పాలు పోస్తున్న భక్తులు

తాచుపాము హల్‌చల్



తాచుపాముకు పూజలు చేస్తున్న మహిళ

ముమ్మిడివరం: చింతవానిరేవులో ఓ తాచుపాము హల్‌చల్ చేసింది. శుక్రవారం గ్రామానికి చెందిన చింతా రామకృష్ణ ఇంట్లోకి తాచుపాము ప్రవేశించడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారికి తెలిపారు. వారు స్నేక్ స్కేచర్ గణేష్ వర్మకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గణేష్ వర్మ ఆ పామును బంధించారు. నాగుల చవితి కావడంతో ఆ పాముకు పూజలు చేసి పాలు పోసి మహిళలు పూజించారు. ఆ తరువాత వర్మ సీసాలో బంధించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అయితే గతంలో పలుమార్లు ఆ ఇంట్లోకి తాచుపాములు రావడంతో ఆ ఇంటి యజమాని రామకృష్ణ ఇల్లుఖాళీ చేసి వేరే ఇంటికి వెళ్లిపోయారు.

సీఎం జగన్‌తోనే ప్రతి ఇంటికీ సంక్షేమం



దొంతికుర్రులో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నేల కిశోర్‌కుమార్

కాట్రేనికోన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని జెడ్పీటీసీ సభ్యుడు నేల కిశోర్‌కుమార్ అన్నారు. దొంతికుర్రు పంచాయతీలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ముందుగా పంచాయతీ కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని జెడ్పీటీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఆయన కోరారు. నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందరికీ కార్పొరేట్ వైద్య సేవలు అందాయన్నారు. ముమ్మిడివరం ఏఎంసీ వైస్ చైర్మన్ కాశి హనుమంతరావు, సర్పంచ్ గెద్దాడ ఈశ్వరి, బొంతు అజయ్‌కుమార్, గుత్తుల నారాయణరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధి కంసాల మామిడి, పల్లపువీధిలో ఎంపీ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు.

తాటాకిల్లు దగ్ధం

ముమ్మిడివరం: గేదెల్లంకలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పోర్షన్ల తాటాకిల్లు కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కోనా మల్లేశ్వరరావు, ఏసు ప్రసాద్‌లకు చెందిన ఈ తాటాకిల్లు దగ్ధమై సుమారు రూ. 2 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది సకాలంలో వచ్చి మంటలను అదుపు చేశారు.

వంట షెడ్డుకు నిప్పు

ముమ్మిడివరం: తల్లిపై కోపంతో కుమారుడు వంట షెడ్డుకు నిప్పు పెట్టాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఠాణేలంక గ్రామానికి చెందిన పేరూరి సీతామహాలక్ష్మి కుమారుడు కోటేశ్వరరావు. శుక్రవారం తల్లిపై కోపంతో అతను మద్యం తాగాడు. అనంతరం వంట షెడ్డుకు నిప్పు అంటించడంతో షెడ్డు పూర్తిగా కాలిపోయింది. వంట షెడ్డులోని సామగ్రి, ఇతర వస్తువులు బూడిదయ్యాయి. మంటలను స్థానికులు అదుపు చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో ముమ్మిడివరం ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేశారు.